



ఉష్ణోగ్రత (అంచనా)

29-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	35	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	28
రెంటచింతల	35	26
చీరాల	34	28

మహానాడులో మన నేతలు



మహానాడు వేదికపై మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



మహానాడులో వేదికపై సీఎం చంద్రబాబు మంత్రి అనగాని సమాలోచన



మహానాడు వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



మహానాడు వేదిక వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

మహానాడు వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



చీరాల నాయకులతో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



మద్దతు.. మమ

విత్తనాలు, నారు వ్యయం తడిసిమోపెడవుతోంది. ఎరువులు.. పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూలి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. డీజిల్ ధర తగ్గనంటోంది. ఈ ధరా భారంతో రైతుల సాగు వ్యయం ఏటికేడు పెరిగిపోతోంది. అయితే ధరలు.. వ్యయం పెరిగే స్థాయిలో మద్దతు ధర పెరగక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సారైనా మద్దతు ధర సాగు వ్యయానికి అనుగుణంగా ఉంటుందని ఆశించిన రైతులను నిరాశపరిచింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను ఖరారు చేసింది. అయితే గిట్టుబాటు ధర మాట ఎలా ఉన్నా, మద్దతు ధర సాగు వ్యయం ఆధారంగా పెరుగుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. మొక్కుబడిగా మద్దతు ధర ను పెంచిందని రైతుల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకుండా పాలకులు మోసగిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.







- ధాన్యం క్వింటాకి రూ.69 పెంపు
- సాగుకు, వ్యయానికి పొంతన లేని ధర
- మొక్కుబడిగా పెంచడంపై రైతుల్లో అసంతృప్తి
- కందులకు రూ.550, పత్తికి రూ.589 పెంపుపై హర్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
సాగుకు.. వ్యయానికి.. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు ఏ మాత్రం పొంతన లేదు. ధరలు పెరిగిన స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర పెంచకపోవడంపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి (మిగతా 4వ పేజీలో)



పొలపాడు రోడ్డులో నిర్మించిన పొలం చెరువు

నీటి కుంట.. ఉపాధికి తంటా

- మొక్కుబడిగా పొలం చెరువుల నిర్మాణం
- లక్ష్యం 12,000.. నిర్మించింది 1,513
- రైతులను చైతన్య పరచడంలో అధికారుల విఫలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం నడుం కట్టింది. విస్తృతంగా పొలం చెరువులు (నీటి కుంటలు) నిర్మించాలని సంకల్పించింది. ఈ మేరకు జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. ఈ నెలాఖరుకు కుంటల పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రైతులకు అవగాహన కల్పించి పొలం చెరువుల నిర్మాణంలో జిల్లాల యంత్రాంగం చతికిలపడింది. రుతుపవనాల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీటి కుంటల నిర్మాణం ముందుకు సాగే పరిస్థితులు కానరావడంలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి కుంటలను పొలాల్లో పెద్ద ఎత్తున చేపట్టారు గత ఐదేళ్ల ఈ పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం రాగానే కుంటల నిర్మాణం చేపట్టాలని తిరిగి నిర్ణయించింది. వాటిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడితే, గ్రామాల్లోని (మిగతా 4వ పేజీలో)

కదిలేదే లేదు



- ఏడీ పోస్టు కోసం 'పూనం' ఉత్తర్వులు రద్దు చేయించిన ఏవో
- గుంటూరు పోస్టు కోసం ఆరోపణలు ఉన్న అధికారి పాట్లు
- వైసీపీ నేపథ్యం ఉన్న వారికి సిఫార్సు లేఖలు
- వ్యవసాయ శాఖ బదిలీల్లో అంతా గందరగోళం

గుంటూరు సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఓ ఉద్యోగి ఒకే చోట ఎక్కువకాలం విధుల్లో ఉండ డానికి నిబంధనలు ఒప్పుకోవు. వ్యవసాయ శాఖలో మాత్రం ఆ సంప్రదాయం ఉన్నట్లు కనిపించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముఖ్య కార్యాలయాల్లో సుమారు 30 మంది అధికారులు పదిహేడేళ్ల నుంచి ఓడీ (ఆన్ డ్యూటీ)లో పని చేస్తూ ఉన్నారు. అది కూడా ఉన్నత అధికారుల ఎరుకలో జరుగుతూ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యవసాయశాఖలో అన్ని ముఖ్య విషయాలను ఓడీపై ఉన్న అధికా రులే చక్క పెడుతూ ఉండటం వివా దాస్పదమవుతున్నది. బదిలీపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిన తర్వాత ప్రధాన కార్యాల యాల్లో పాతుకు పోయి అవినీతి, అక్రమా లకు ఊతంగా ఉన్న కొందరు అధికా రుల వ్యవహారం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది. చాలామంది మహిళా అధికారులు సుమారు దశాబ్దం నుంచి వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వారికి కూడా పోస్టింగ్‌లు దక్కకుండా ఓడీపై కొనసాగుతున్న అధికారుల మాఫియా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు న్నాయి. గత ప్రభుత్వం టీడీపీకి అనుకూలంగా ఉండే అధికారులను జిల్లా కేంద్రం నుంచి సుదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఇప్పుడు ఆ అధికారులు జిల్లా కేంద్రం దగరకు రావడానికి కూడా ఓడీ అధికారుల బృందం అడ్డుపుల్లలు వేస్తుంది.



సామాన్యులు కాదు..

గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖలోని కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇదే సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ ఏవో చేసిన సాహసకార్యంపై చర్చ జరుగుతున్నది. ఆ మండల వ్యవసాయ అధికారి ఏడీఏగా కొనసాగేందుకు ఏకంగా అప్పటి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులను రద్దు చేయించారు. అక్కడికి (మిగతా 4వ పేజీలో)



టిక్కెట్ల బుకింగ్‌లో.. ఇక్కట్లు

- ఐఆర్‌సీటీసీ పోర్టల్, యాప్ తరచూ క్రాష్
- టిక్కెట్ల బుకింగ్‌కు సాంకేతికంగా సమస్యలు
- ప్రయాణికుల దోపిడీకి ఇతర యాప్‌లకు మేలు

గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ ఇటీవల తరచుగా క్రాష్ అవుతున్నది. ఒక పట్టాన యూజర్లను లాగిన్ కానీయడం లేదు. ఒకవేళ లాగిన అయినా టిక్కెట్ల బుకింగ్ చేసేందుకు సాంకేతిక సమస్యలను సృష్టిస్తున్నది. జనరల్ టిక్కెట్ల బుకింగ్‌కే ఇలాంటి పరిస్థితి కొన సాగుతుండగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో చుక్కలు చూపిస్తున్నది. గతంలో ఎప్పుడూ ఇలాంటి సమస్య లేదని యూజర్లు వాపోతున్నారు. ప్రధానంగా మీ ఇంటర్నెట్ కనెక్టివిటీని చెక్ చేసుకోమంటూ ఎర్రర్ సందేశం వస్తున్నది. మొబైల్ ఇంటర్నెట్, వైఫై, బ్రాడ్ బ్యాండ్ సేవలు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమస్య ఉత్పన్నం అవుతున్నది.

గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా బుకింగ్‌లు

ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్ పోర్టల్ రైల్వే టిక్కెట్ల బుకింగ్‌కు మొరాయిస్తుండటంతో యూజర్లు గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా అదనపు సర్వీసు చార్జీలు చెల్లించి టిక్కెట్లు బుకింగ్ చేసుకోవాల్సి వస్తోంది. ఇదే సమయంలో టిక్కెట్ చార్జీపై అదనంగా రూ.50 చెల్లిస్తే ఒకవేళ క్యాన్సిలేషన్ చేసుకున్నా ఫుల్ రీఫండ్ చేస్తామంటూ వల విసురుతున్నాయి. అదే ఏసీ టిక్కెట్లకు త్రీటైర్ అయితే రూ.127, సెకండ్ ఏసీ అయితే సెకండ్ ఏసీకి రూ.177, ఫస్టు ఏసీకి రూ.295 చెల్లిస్తే త్రీటైర్ టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్నా పూర్తి రీఫండ్ చేస్తామంటున్నాయి. ఈ విధంగా ప్రయాణికులను దోపిడీ చేసేందుకు ఐఆర్‌సీటీసీ సంస్థ ఇతర యాప్‌లకు మేలు చేకూరుస్తున్నది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మహానాడులో నేతల విరాళాలు



గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప లో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతి నిధులు, నేతలు భూరి విరాళాలు ప్రకటించారు. బుధవా రం రెండో రోజు సభావేదిక వద్దే వారు విరాళాలను అధినేత చంద్రబాబుకు అంద జేశారు. గుంటూరుకు చెందిన భాష్యం రామకృష్ణ రూ.కోటి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లా రావు రూ.25 లక్షలు, టీడీపీ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే రూ.25 లక్షలు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రూ.10 లక్షలు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రూ.10 లక్షలు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ రూ.10 లక్షలు చొప్పున విరాళాలు అందజేశారు.

నేడు స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి గురువారం గ్రేడ్ 2 హెచ్ఎంలుగా ఉదోగోన్నతులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేసుకున్న వారు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని ఎంఈవోలు డిప్యూటీఈవోలు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను ఉద్యోగోన్నతుల కోసం ప్రోత్సహించాలని డీఈవో సూచించారు.

కోవర్టులపై కన్నెర్ర

- మహానాడు వేదికగా చంద్రబాబు హెచ్చరిక
- ప్రత్యర్థులతో చేతులు కలిపితే వదిలిపెట్టమని ఆగ్రహం
- 'కూటమిలోకి కోవర్టులు' కథనంతో కలకలం



గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో జరిగిన జంట హత్యలతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. హత్యకు గురైన వారే కాకుండా హత్య చేసిన వారు కూడా టీడీపీ వారేనని తొలుత పల్నాడు పోలీసు అధికారులు ప్రచారం చేయడంతో టీడీపీలో ఇటువంటి పరిణామాలు ఏమిటని పార్టీ అధిష్ఠానం నివ్వెరపోయింది. అయితే ఆ తర్వాత హత్య చేసిన వారు ఇటీవలే టీడీపీలో చేరిన వారని, వారిని ప్రోత్సహించి వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులే హత్యలు చేయించారని వెల్లడైంది. దీంతో ఆ సోదరులిద్దరిపై కూడా కేసు నమోదు చేశారు. దీంతో టీడీపీ ముఖ్య నేతల్లో అంతర్మథనం మొదలైంది. వైసీపీ కోవర్టులు నేరుగా అవకాశం దొరికితే టీడీపీలో చేరుతున్నారు. లేదంటే జనసేన, బీజేపీ ముసుగులో కూటమి గొడుగు కిందకు చొరబడుతున్నారు. దూరంగా ఉండే శత్రువు పట్ల అప్రమత్తతగా ఉండగలం కానీ పక్కనే మిత్రుల రూపంలో ఉండే శత్రువు నుంచి ఎలా కాపాడుకోగలమని అసలు సిసలైన నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. ఏ నిమిషాన ఎటువంటి విపత్తు కోవర్టుల నుంచి పొంచి వస్తుందోనని భయపడుతున్నారు. ఈ పరిస్థితిపై రెండు రోజుల క్రితం టీడీపీలోకి (మిగతా 4వ పేజీలో)



తడి భూములను సంరక్షించాలి

- సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలి
- సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): తడిభూముల సంరక్షణపై అధికారులు బాధ్యత వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ జలవనరులను సంరక్షిస్తేనే తడిభూమిని భద్రంగా ఉంచగలమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను విధిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. తడిభూములను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదన్నారు. ఆ ప్రాంతాల్లో చెత్తవేయడం, వ్యర్థాలు కుప్పగా వేయరాదన్నారు. సముద్రతీర ప్రాంతాల్లోని తడిభూములలో మడ అడువులను వృద్ధి చేయాలన్నారు.సమావేశంలో అటవీశాఖాధికారి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఎన్టీఆర్ జీవితం దర్పణం

ఎన్టీఆర్ జయంతిలో ఎస్పీ తుషార్‌డూడి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు, పట్టుదలకు ఎన్టీఆర్ జీవితం దర్పణం పడుతుందని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నటుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రజల మనుస్సులను గెలుచుకున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీఐ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో అధికారుల తనిఖీలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆర్‌డీవోలు, తహసీల్దార్ల పర్యవేక్షణలో రెవెన్యూ, సివిల్ సప్లయిస్ డీటీలు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేశారు. ప్రధానంగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, ఆహార పదార్థాల విక్రయం, టిక్కెట్ ఛార్జీలు, లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ, సీటింగ్ కెపాసిటీ తదితరాలపై తనిఖీలు జరిగాయి. బాపట్లలోని చీరాల రోడ్డులో ఉన్న శ్రీనివాసమహల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని విజయకృష్ణ థియేటర్లలో ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. శానిటేషన్‌పై మరింత శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి ఆర్డీవో నిర్వాహకులకు సూచించారు.



బాపట్లలోని చీరాల రోడ్డులో థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఏపీకి ఆక్సిజన్ ఇచ్చిన చంద్రబాబు

◆ కడప మహానాడులో కేంద్రమంత్రి పెమ్మసాని



గుంటూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థిత ప్రజ్ఞతతో సీఎం చంద్రబాబు తీసుకున్న ఒక నిర్ణయం వల్ల, వెంటిలేటర్ మీద ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఆక్సిజన్ అందించి ప్రాణం పోశారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం మాట్లాడారు. '40 ఏళ్ల అనుభవాల విశ్వవిద్యాలయం, నిత్య నూతన ఆలోచనల విజ్ఞాన క్షేత్రం చంద్రబాబని, ఓటమికి దడవని గుండె, ఒక చేత్తో పసుపు జెండా, మరో చేత్తో అభివృద్ధి అజెండా పట్టుకొని భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నారని కొనియాడారు. పోయిన ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి పూర్తి అధికారం ఉంది. కావాల్సినంత మంది ఎంపీలు ఉన్నారు. కావాల్సిన అవినీతి సొమ్ము ఉంది. అయినాగానీ ఏమి చేయలేక పోయారు. ఈరోజు చూస్తే తెలుగువాడు తలఎత్తుకునేలా, తెలుగు జాతి గర్వపడేలా, ప్రపంచమంతా మన వైపు చూసేలా అమరావతి నగరం అద్భుతంగా రూపుదిద్దుకోబోతుంది. అమెరికాలో కూడా లేనటువంటి స్థాయిలో 2014-19 మధ్య అమరావతికి రెండు యూనివర్సిటీలు వచ్చాయన్నారు. రాబోయే అమరావతి మహానగరం చరిత్రలో ఒక మైలురా యిగా మిగిలిపోబోతుంది. ఆగిపోయిన పోలవరాన్ని కదిలించడానికి చంద్రబాబు ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లారో, కేంద్ర మంత్రులతో ఎలా కలిసేవారో కళ్లారా చూశాన న్నారు. ప్రతి ఇంటికి నీరు అందించాల్సిన జల జీవన్ మిషన్ స్కీమ్‌కు రూ.20 వేల కోట్ల బడ్జెట్ వచ్చిందన్నారు. జగన్ కేవలం రూ.2000 కోట్లు ఖర్చు పెట్టి 12 వేల కోట్లు నష్టం చేశారన్నారు. చంద్రబాబు దృష్టి, దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తు ఉంది' అంటూ పెమ్మసాని కొనియాడారు.

నర్సింగ్ కళాశాలలో ప్రవేశాలకు ఏపీ ఎన్ సెట్-2025

ఎంఏఎం గ్రూప్ కళాశాలల అధినేత మేదరమెట్ల రామ శేషగిరిరావు

నరసరావుపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : బీఎస్సీ నర్సింగ్ నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సులో జాయిన్ ఆయ్యే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలిసారిగా ఏపీ ఎన్ సెట్-2025 నిర్వహిస్తుందని ఎంఏఎం గ్రూప్ కళాశాలల అధినేత మేదరమెట్ల రామశేషగిరిరావు బుధవారం తెలిపారు. కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ మే 28న జారీ చేశారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మే 28 ఉదయం 11 గంటల నుంచి జూన్ 20 సాయంత్రం 6 గంటల వరకు డీఆర్ఎన్‌టీఆర్‌డాట్‌యుహెచ్ఎస్ఏపీడాట్ ఇన్ ద్వారా అందుబాటులో ఉంటాయన్నారు. హాల్ టిక్కెట్లు జూన్ 25న ఉదయం 10 గంటల నుంచి డీఆర్ఎన్‌టీఆర్‌డాట్ యుహెచ్ఎస్ఏపీ డాట్ ఇన్‌లో కూడా డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంటాయన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 6 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతుందన్నారు. తాత్కాలిక సమాధానాల కీ జూలై 7న విడుదల చేస్తారని, అభ్యంతరాలను జూలై 7 నుంచి 9 వరకు సమర్పించవచ్చునని చెప్పారు. తుది కీ, ఫలితాలు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయన్నారు.

మార్కెటింగ్‌లో భారీగా బదిలీలు

- విజిలెన్స్ కేసులో ఉన్న వారందరినీ సాగనంపిన కమిషనర్
- గతంలో ఎన్నడూ లేని విధంగా జోన్ దాటి సూపర్‌వైజర్లకు స్థానచలనం
- ఈ విషయంలో జాయింట్ డైరెక్టర్లకు అధికారాల కోత
- బదిలీల వెనక అధికార పార్టీ నేతల సిఫార్సులున్నాయని ఆరోపణలు



గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ జిల్లా శాఖలో భారీగా అధికారుల బదిలీలు జరిగాయి. చుట్టు గుంటలోని ఆ శాఖ కమిషనరేట్‌కు అధికారులను పిలిపించి కమిషనర్ విజయ సునీత బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విషయంలో జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులను కూడా పక్కన పెట్టేశారు. గతంలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సూపర్‌వైజర్ స్థాయి అధికారుల బదిలీలు జరిగేవి. ఒకవేళ వేరే జిల్లాలకు బదిలీ చేసినా పరస్పర ట్రాన్స్‌ఫర్లు జరిగేవి. అలాంటిది ఈ దఫా జోన్ దాటించి బదిలీలు చేశారు. దీనిపై కొంత మంది అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని మార్కెటింగ్ ఉద్యోగుల సంఘం దృష్టికి తీసుకెళ్లి ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేయాలని, అవసరమైతే న్యాయపోరాటానికి దిగాలని కోరుతున్నారు.

గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీపై ఇటీవల విజిలెన్స్ నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. మొత్తం 18 మంది అధికారులపై ఆ శాఖ నివేదిక సమర్పించింది. దీనిపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. వాళ్లతో పాటు మరికొందరిని కూడా సాగనంపింది. గ్రేడ్-2 సెక్రెటరీ ఆంజనేయసింగ్, గ్రేడ్-3 కార్యదర్శి శ్రీకాంత్, అసిస్టెంట్ సెక్రెటరీలు ఆనందభాస్కర్, జయరామిరెడ్డి, యూడీసీ నరేంద్ర, సూపర్‌వైజర్లు జీ మురళీకృష్ణ, షేక్ కరీం, జీ యల్లమంద, జీ శివకుమారి, షేక్ ఫాతిమూన్, కే అంబిక, కే సాంబిరెడ్డి, కేవీడీఎస్ నాగరాజు, ఎం శ్రీనివాసరావు, ఏ రమేష్‌బాబు, దిల్ బహదూర్, వీ సుధాకర్‌రావు, సీహెచ్ శివారెడ్డి, షేక్ ముస్తఫా, సీహెచ్ పెద్దారావు, ఎం వీ రాఘవరావు, జేఎంఎస్ ఖాజా, డ్రైవర్ కే శ్రీనివాసరావులను వేరే జిల్లాలకు బదిలీ చేశారు. అలానే తాడికొండ ఏఎంసీలో పోస్టింగ్ కలిగి గుంటూరు ఏఎంసీలో డిప్యూటేషన్‌పై ఉన్న రమాదేవిని వెనక్కు పంపించారు.

డీడీగా దివాకర్

మార్కెటింగ్ శాఖ గుంటూరు డిప్యూటీ డైరెక్టర్‌గా కృష్ణా జిల్లాలో విధులు నిర్వహిస్తున్న దివాకర్‌ని పోస్టింగ్ చేశారు. ఆయన గతంలో గుంటూరు ఏఎంసీకి సెక్రెటరీగా విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జాన్సీరాణిని బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వలేదు.

ఏడీ రాజబాబు బదిలీ

మార్కెటింగ్ ఏడీ బీ రాజబాబుని ఎన్‌టీఆర్ జిల్లాకు కమిషనర్ బదిలీ చేశారు. ఆయన్ని తిరువూరు ఏఎంసీకి సెక్రెటరీగా నియమిస్తూ ఎన్‌టీఆర్ జిల్లా మార్కెటింగ్ ఏడీగా కూడా అదనపుబాధ్యతలు కేటాయించారు. బదిలీ అయిన రాజబాబు స్థానంలో ఇక్కడికి ఎవరిని పోస్టింగ్ చేశారనే దానిపై స్పష్టత రాలేదు.

నామ్‌కే వాస్తేగా జేడీలు

మార్కెటింగ్ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు జాయింట్ డైరెక్టర్లు ఉన్నారు. వీరి పరిధిలోనే ఆరు నుంచి ఏడు జిల్లాలు ఉంటాయి. గతంలో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగుల బదిలీలు జేడీల వద్దనే జరిగేవి. అలాం టిది ఈ దఫా నలుగురు జేడీలను కమిషనర్ పక్కన పెట్టేశారు. దీనిపై ఒక జేడీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

టీడీపీకి భాష్యం ప్రవీణ్ రూ.43 లక్షల విరాళం

మహానాడులో సీఎం చంద్రబాబుకి చెక్కు అందజేత

పెదకూరపాడు,మే 28 (ఆంధ్రజ్యోతి) తెలుగుదేశం పార్టీ స్థాపించి 43 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ నిధికి టీడీపీ జాతీయ అధ్యక్షులు, సీఎం చంద్రబాబు నాయుడుకు రూ.43 లక్షల చెక్కును పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ విరాళంగా అందించారు. కడపలో మహానాడు రెండో రోజు బుధవారం సభా వేదికపై చంద్రబాబుకి చెక్కును ప్రవీణ్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా పని చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. తన రాజకీయ జీవితానికి తెలుగు దేశం పార్టీనే మూలాధారమని.. కార్యకర్త నుంచి నేడు శాసనసభ సభ్యునిగా తనను టీడీపీ ప్రజల ముందు నిలబెట్టిందన్నారు. తెలుగువారి ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగు దేశం పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా విరాజిల్లుతుందన్నారు. మంత్రి లోకేశ్ సహకారంతో ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి భాష్యం ప్రవీణ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : అనగాని

రేపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపా రు. కడపలో జరుగుతున్న మహానాడులో బుధవారం రెండో రోజున రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కొన్ని అంశాలు ముఖ్యమం త్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. రానున్న విద్యాసంవత్సరానికి విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద నగదు జమచేస్తామని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణంను కల్పించనున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలుగువాడి కీర్తి ప్రతిష్టలను దేశవ్యాప్తంగా చాటిచెప్పింది ఎన్టీఆర్ అన్నారు. ఆయన అడుగుజాడల్లో చంద్రబాబునాయుడు పయనిస్తూ రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు తండ్రికి తగ్గ తనయుడుగా మంత్రి లోకేశ్ ముందుకు వెళుతున్నారన్నారు. రాష్ట్రాన్ని నాలుగేళ్ళలో ఇచ్చి న హామీలే కాకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

నూతన భవన సముదాయానికి రూ. 6 లక్షల విరాళం



సామినేని కోటేశ్వరావుకు చెక్కును అందజేస్తున్న గద్దె రమేష్

గుంటూరు(తూర్పు), మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షల విరాళాన్ని గుంటూరు నగరానికి చెందిన పారిశ్రామిక వేత్త గద్దె రమేష్ ప్రకటించారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆడపిల్లల భవిత కోసం దాతలు అందజేస్తున్న విరాళాన్ని పారదర్శకంగా ఖర్చు పెడుతున్నామని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ఫీజులో వెయ్యి రూపాయిలను తగ్గించేలా నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. గద్దె రమేష్ మాట్లాడుతూ నూతన భవనంలో భాగస్వామి అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గోరంట్ల పున్నయ్య చౌదరి, మర్రిపూడి సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

కదిలేదే లేదు

(3వ పేజీ తరువాయి)

ఒక ఏడీఏను నియమించినా జాయిన్ కాకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే మండల వ్యవసాయ అధికారి ఏడీఏగా కొనసాగుతూ ఉన్నారు. 17 ఏళ్ల నుంచి ఓడీపై కొనసాగుతున్న నిర్వాహకం తేటతెల్లమవుతోంది.

వైసీపీ నేపథ్యం ఉన్నా లేఖలు..

గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఓ అధికారికి గుంటూరు రూరల్ మండలంలోని వైసీపీ ముఖ్య నేతలతో బంధుత్వం కూడా ఉంది. అదే అధికారి గతంలో ఈ ప్రాంతంలో పనిచేసి నప్పుడు అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. ఇప్పుడు అదే అధికారిని గుంటూరు ఏడీఏ నియమించాలని సిఫార్సు లేఖలు ఇవ్వడం వివాదాస్పద మైంది. పూర్తిగా వైసీపీ నేపథ్యం ఉన్న వారికి సిఫార్సు లేఖలు ఇవ్వడంపై వ్యవసాయ శాఖలోని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ అధికారి టీడీపీకి అనుకూలమని ఆయన్ను బలవంతంగా తొలగించారు. ఆయన్ను అదే పోస్టులో కొనసాగించాలని ఓ సీనియర్ ఎమ్మెల్యే లేఖ ఇచ్చిన తర్వాత కూడా సుదూర ప్రాంతా నికి పంపారు. కొందరు వ్యక్తులు అధికారుల విషయంలో ప్రజాప్రతి నిధుల కార్యాలయాల్లోని సిబ్బందిని పక్కదారి పట్టించి ఇటువంటి బదిలీలకు శ్రీకారం చూడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టోటల్‌గా కలెక్షన్...

అయితే ప్రస్తుతం వ్యవసాయ శాఖలో జరుతున్న బదిలీల ప్రక్రియపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఎన్ని సిఫార్సు లేఖలు ఉన్నా కొందరు అధికారులు కప్పం చెల్లించాల్సిందే అని ము ఖం మీదే చెబుతున్నట్లు తెలుస్తుంది. అదేమంటే ఓ ముఖ్యమైన వ్యక్తి ని లైన్‌లో పెట్టి మాట్లాడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మద్దతు.. మమ

(3వ పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నది. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 విదిల్చిందని రైతులు వాపోతున్నారు. ఎంతో కాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369కి పెంచింది. కింటా ధాన్యం మద్దతు ధర రూ.500 నుంచి 600 వరకు పెంచి ఉంటే మేలు జరిగి ఉండేదని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కందులకు క్వింటాకు రూ.7550 నుంచి రూ.8000కు, పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7121 నుంచి రూ.7710కి పెరిగింది. మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2225 నుంచి 2400కి పెంచించారు. మొక్కజొన్న, పత్తి, కందికి కూడా ఇంకా మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. మినుములు క్వింటాకు రూ.400, జొన్నలు క్వింటాకు రూ.328 మద్దతు ధర పెరిగింది.

కోవర్టులపై కన్నెర్ర

(3వ పేజీ తరువాయి)

కోవర్టులు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. మాచర్ల జంట హత్యల ఉదంతంతో కోవర్టుల తీరును గమనించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు కడపలో మహానాడు వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పార్టీలో కొంతమంది ప్రత్యర్థులతో చేతులు కలిపి మనమధ్య కోవర్టులుగా ఉంటున్నారు.. వైసీపీ నేతల ప్రోత్సాహంతో హత్యా రాజకీయాలు చేస్తున్నారు.. ఇలాంటి తప్పుడు పనులు చేసే ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టను.. గుడ్డిగా ఇక ఎవరినీ నమ్మం.. అంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. దీంతో వైసీపీకి కోవర్టులుగా వ్యవహరిస్తున్న చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి నేతల వరకు వణికిపోతున్నారు.

నామినేటెడ్ పదవుల వైపు చూపు..

అధికారం వచ్చాక కొందరు.. అధికారం వస్తుందని ముందే గ్రహించి ఎన్నికలకు కొద్ది రోజుల ముందే కూటమి నీడకు వచ్చిన నేతల్లో కొందరు ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ఆయన అరాచక బ్యాచ్‌కు కోవర్టులుగా వ్యవహరిస్తున్నారు. వీళ్లైతే హత్యలు, లేకుంటే దాడులు చేస్తూ దానికి ఆధిపత్య పోరుగా రంగు పులుముతూ కోవర్టులమనే విషయం బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరిలో కొందరైతే నామినేటెడ్ పదవులపై కూడా కన్నేశారు. దీంతో పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉంటూ ఆర్థికంగా తోడ్పాటు అందించిన వారిని పక్కకునెట్టి పదవులు చేజిక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. తమలాగా పార్టీ కోసం పాటు పడిన వారిలో ఎవరికి పదవి దక్కినా సంతోషిస్తాం కానీ కోవర్టులకు పదవులు దక్కితే తాము తలెత్తుకొని ఎలా తిరగ్గలమని పార్టీ వీరాభిమానులు ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు హెచ్చరికతో ఈ కోవర్టుల బెదత వీడుతుందేమో చూడాలి.

నీటి కుంట.. ఉపాధికి తంటా

(3వ పేజీ తరువాయి)

కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు, రైతులకు నీటి వసతి ఉంటుందని భావించింది. అయితే పొలంలో చెరువు వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించి నిర్మాణానికి అంగీకరించేలా రైతులను చైతన్య పరచడంలో యంత్రాంగం విఫలమైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 12,000 పొలం చెరువులు నిర్మించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 1,513 చెరువులను మాత్రమే నిర్మించారు. పనులు చేపట్టడంలో నెలకొన్న నిర్లక్ష్యం ఉపాధి కార్మికులకు శాపంగా మారింది. గ్రామంలోనే పనులు లభించే పరిస్థితికి వారు దూరమయ్యారు. చెరువుల నిర్మాణం అంతంతమాత్రంగా ఉండ టంతో కార్మికుల ఉపాధికి గండిపడింది.పల్నాడు జిల్లాలో 6,500 నీటి కుంటలకు 4,528 నీటి కుంటలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీటిలో 1,663 కుంటలకు 777 మాత్రమే అంటే 17.16 శాతం పూర్తి చేసినట్లు డ్వామా అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 1,500 నీటి కుంటలు లక్ష్యం కాగా 776 మంజూరయ్యాయి. వీటిలో 100 అంటే 12.89 శాతం పనులు పూర్తయ్యాయి. బాపట్ల జిల్లాలో 4,000 సేద్యపు నీటి కుంటలకు 2,298 మంజూరు చేశారు. వీటిలో 636 అంటే 26.60 శాతం నిర్మించారు.

ఆ ప్రాంతం.. యమ డేంజర్

❑ నిత్యం అక్కడ రోడ్డు ప్రమాదాలు ❑ హైవే విస్తరణలో భాగంగా అక్కడ నిలిచిన పనులు



ప్రమాద భరితంగా ఉన్న ప్రాంతం

పెదకాకాని, మే 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని పెదకా కానిలో విస్తరించారు..... కానీ ఒకచోట రోడ్డు విస్తరణ మరిచారు..... ఆ ప్రాంతమే యమ డేంజర్‌గా మారింది..... నిత్యం రోడ్డు ప్రమాదాలు జరగటం.... ఎందరినో ఆ ప్రాంతం కబలిస్తుంది.... మరికొందరిని క్షతగాత్రులుగా మారుస్తుంది.... దీంతో పెదకాకానిలో ఆ కొద్ది ప్రాంతం దాటితే అమ్మయ్య.... ఈరోజుకు ప్రాణాలు దక్కినట్లే అన్నట్లుంది అక్కడ ప్రజల పరిస్థితి.... సంబంధించిన వివరాలు ఎలా ఉన్నాయి..... పెదకాకానిలో గత కొన్నేళ్ల క్రితం జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. సైడ్ అప్రోచ్ రోడ్లను కూడా విస్తరించారు. అయితే పెదకాకాని సెంటర్‌కు సమీపంలోని గౌడపాలెం వెళ్లే మూల టర్నింగ్ వద్ద ఒక భవనాన్ని హైవే అధికారులు వదిలేశారు. ఆ భవనానికి సంబంధించి నష్టపరిహారం కూడా చెల్లించారు. కానీ ఆ భవనాన్ని కూల్చకుండా వదిలేశారు. దీంతో గౌడపాలెం గుండా వచ్చే వాహనాలు..... హైవే నుంచి వచ్చే వాహనాలు అక్కడ కలుస్తుంటాయి. ఇటువంటి కీలక ప్రాంతంలో రోడ్డు పూర్తిగా కుషించుకు పోయింది. రెండు పక్కల నుంచి వచ్చే వాహనదారులు కనపడరు. దీంతో అనేకమంది ప్రతిరోజు ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. ఇటీవల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి... ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రముఖ సింగర్ మృతి చెందాడు. అదేవిధంగా ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటంలో మరో వ్యక్తి దుర్మరణం చెందారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది మృత్యువాత పడగా..... మరికొందరు గాయాలతో క్షతగాత్రులుగా మిగిలారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించాల్సి ఉంది. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆ భవనాన్ని తక్షణమే కూల్చివేయాలని పెదకాకాని ప్రజలు కోరుకుంటున్నారు.

నేడు ఆచార్య నాగార్జునుడి విగ్రహావిష్కరణ

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జునుడి జన్మస్థలమైన యాజలి గ్రామంలో ఆయన విగ్రహాన్ని గురువారం ఉదయం ఆవిష్కరించనున్నారు. పోరంపర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆవిష్కస్తారని పోరంపర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యాజలి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

చీలురోడ్డుసెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : నేరాలు నియంత్రణలో భాగంగా పట్టణంలోని చీలురోడ్డుసెంటర్ కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ ఆర్ రాంబాబు చొరవ తీసుకొని మూడు దిక్కులకు మూడు కెమెరాలు ఏర్పాటు చేశారు. గుంటూరు రోడ్డు వైపు, కర్లపాలెం రోడ్డువైపు, బాపట్లరోడ్డు వైపు మూడు కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నేరాలు అదుపు చేసేందుకు కృషి చేస్తామన్నారు. 24గంటలు విజన్ సీసీ కెమెరాలు పనిచేస్తాయని చెప్పారు.

వేమూరు ఎస్ఐగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

వేమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): వేమూరు నూతన ఎస్ఐగా జి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రవికృష్ణ బదిలీపై వెళ్లడంతో ప్రకాశం జిల్లా సంతమాగులూరు ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై వేమూరు వచ్చారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం పని చేస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ శ్రీనివాసరావును పోలీస్‌స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు.

కొల్లూరు ఎస్ఐగా అమర్‌వర్ధన్



అమరవర్ధన్

కొల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు ఎస్ఐగా అమర్‌వర్ధన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద కార్యకలాపాలను సహించబోనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎస్ఐను సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు.

అమృతలూరు ఎస్ఐ రవితేజ



రవితేజ

అమృతలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు ఎస్ఐగా రవితేజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న జానకి అమర్‌వర్ధన్ బదిలీపై కొల్లూరు పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. అద్దంకి ఎస్ఐగా పనిచేస్తున్న రవితేజను అమృతలూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా సహించేది లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

పారిశ్రామికవేత్తలుగా తయారవ్వాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్

కర్లపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను, ఒక వ్యాపారవేత్తను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. కర్లపాలెం మండలం స్థానిక తిమ్మారెడ్డిపాలెం హైవే పక్కన ఏపీఎం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సెర్ప్‌వారి సౌజన్యంతో యూనియన్ బ్యాంకు వారి ఆర్థిక సహాయంతో గుర్రపుశాల వెంకటేశ్వరమ్మ ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజస్‌స్కీం ద్వారా ప్రారంభించిన గానుగ ఆయిల్ మిల్లును ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మినిస్ట్రీఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అనీల్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం వారితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అరుణ్‌కుమార్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ సువార్తమ్మ, యూనియన్ బ్యాంకు ఆర్‌డీవో మనోజ్, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, వెలుగు కార్యాలయ సీసీలు శ్రీధర్, రాఘవ తదితరులుపాల్గొన్నారు.

గండి అనకట్ట నిర్మాణానికి రూ.11 కోట్లు అంచనాలు

● డీఈ గోపినాథ్



పెసర్లంక వద్ద గండిని పరిశీలిస్తున్న డీఈ గోపినాథ్, ఏఈలు

కొల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది అంచుల వద్ద పడిన గండికి అనకట్ట నిర్మాణానికి రూ.11కోట్ల అంచనాలు రూపొందించినట్లు డీఈ గోపినాథ్ తెలిపారు. బుధవారం మండలపరిధిలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన వర్షాలు, వరదలకు పడిన గండిని నదీ పరిరక్షణ శాఖ డీఈ గోపినాథ్, ఏఈలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో గండి ద్వారా వరద నీరు గ్రామాలను ముంచెత్తకుండా నిలువరించేందుకు అనకట్ట నిర్మాణానికి రూ.11 కోట్ల అంచనాలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఉత్తర్వులు వెలువడిన అనంతరం ఆనకట్ట నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆనకట్ట పరిశీలనలో ఏఈలు సురేష్‌కుమార్, విజయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు జాతి ఉన్నంత వరకు చరిత్రలో ఎన్టీఆర్

● మహానాడు సభలో ఎమ్మెల్యే ఆనందబాబు



మహానాడు సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోతారని ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసేందుకు సమిష్టి కృషి అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడు మహాసభలో బుధవారం ఆయన ప్రసంగించారు. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. రాజకీయం అంటే ఏమిటో తెలియని రోజుల్లో సామాన్యుడికి కూడా తెలిసే విధంగా ఎన్టీఆర్ పార్టీని స్థాపించి రాజకీయపరంగా అందరిని చైతన్యవంతులను చేసి ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయాన్ని అందించారన్నారు. ఆయన బాటలో నడుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రవేశ పెట్టి ఐటికి టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ రంగాలకు బాటలు వేశాడన్నాడు. హైదరాబాద్‌ను సిలికాన్ వ్యాలీగా తీర్చిద్దిన ఘనత చంద్రబాబుదే అన్నారు. హైటెక్ సిటి నిర్మాణం మైక్రోసాఫ్ట్ గూగుల్ వంటి అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చారన్నారు. బిల్‌గేట్స్, బిల్‌క్లింటన్, టోనిబ్లేయర్ వంటి ప్రపంచ నేతలతో సమావేశాలు జరిపి వారిని తెలుగు రాష్ట్రాలకు తీసుకువచ్చిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా తెలుగుజాతి కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో అంచలంచెలుగా ఎదిగేలా నారా లోకేశ్ అభివృద్ధి చేస్తున్నారు. నారా లోకేశ్ 3 వేల కి.మీ పైగా పాదయాత్ర చేసి రాష్ట్రంలో యువత, నిరుద్యోగుల సమస్యలు తెలుసుకుని వారి కోసం 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో తెలుగుజాతి కీర్తిని విశ్వ వ్యాప్తంగా అభివృద్ధి చేస్తారని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

యుగపురుషుడు ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
● నందమూరికి ఘన నివాళులు



కడప మహానాడులో పార్టీశ్రేణులతో కలిసి ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, పలువురు పార్టీ నాయకులు

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే జీవితాశయంగా భావించిన ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల నాయకులతో కలిసి ఎమ్మెల్యే అక్కడ ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి కొత్తబాటలు వేసి సంఘసంస్కర్తగా ఎన్టీఆర్ పేదల కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరు పయనిస్తూ ఆయన ఆశయాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్, మందపాటి ఆంధ్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి పల్లం సరోజినీ, జీవన్, షాలెంరాజు, కూచిపూడి ఝాన్సీరాణి, అచంట అమరేష్, విజయ్ కుమార్, హనుమాన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల మండలంలోని చెరువుజమ్ములపాలెంలో ఎన్టీరామారావు విగ్రహానికి టీడీపీ నాయకులు పుష్పాంజలి ఘటించి నటుడిగా, రాష్ట్రముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కరణం యజ్ఞేశ్వరరావు, కొమ్మినేని శ్రీనివాసరావు, కరణం బలరామూర్తి, అక్కిరామారావు, యార్లగడ్డ హరిబాబు, కట్టా శ్రీరామశేషు, నూతలపాటి చైతన్య పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్

● బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయులు ఎన్టీరామారావు తెలుగు ప్రజల ఆరాధ్యదైవమని బావుడా చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు, బూర్లె రామసుబ్బారావు, శీలం శ్రీనివాసరావు, కొల్లూరి వెంకట్రావు, కే రమేష్, షణ్ము తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని అప్పికట్ల గ్రామంలోని, జీబీసీ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీశ్రేణులంతా కలిసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాకతీయ సేవా సమైక్యఅధ్యక్షులు అచంట రమేష్, డిసి ఇనగంటి శ్రీకాంత్, బూత్ ఇన్‌చార్జి అమర్‌నాద్, కుర్రా ప్రభాకర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు, ఆధ్యాపకులతో కలిసి ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటించారు.

● బాపట్ల ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.



చెరువు జమ్ములపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కర్లపాలెం మండలంలో..

కర్లపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం ఐలెండ్ సెంటర్లోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, ఎట్రావారి పాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ పఠాన్ కరీముల్లా, సర్పంచ్ నక్కల శేషాద్రి, నీటిసంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రావిరాంబాబురెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, జనసేనపార్టీ ఉపాధ్యక్షుడు సురేంద్ర, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి కొండదాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఎట్రావారిపాలెం సచివాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రామసర్పంచ్ వెంకటలక్ష్మీ, సచివాలయ సిబ్బంది పూలమాల వేసి నివాళి అర్పించారు.

● మండలపరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజిని, పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు నివాళులు అర్పించారు.

● పిట్టలవానిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిల సంయుక్త ఆధ్వర్యంలో మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తొలుత మండల అధ్యక్షులు ఎండీ అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గ్లోరియానేట్ ఎన్టీ ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

యోగాంధ్రలో సభ్యత్వ నమోదు లక్ష్యాలను చేరుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి ● బాపట్ల రథంబజారులో ప్రతిరోజు యోగా శిక్షణలు

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో సభ్యత్వ నమోదు లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాలు, సభ్యత్వ నమోదుపై జిల్లా, మండలస్థాయి అధికారులతో బుధవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలు బాపట్ల జిల్లాలో జయప్రదంగా నిర్వహించటానికి ట్రైనర్లకు సమర్థంగా శిక్షణలివ్వాలని చెప్పారు. సభ్యత్వ నమోదు, ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలపై నిర్లిప్తంగా ఉండరాదని ఆదేశించారు. జూన్ 21వ తేదీన మెగా డే నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో 6,31,435 మందిని సభ్యులుగా చేర్చాల్సి ఉండగా ప్రస్తుతం 1,21,213మంది సభ్యులయ్యారన్నారు. ఈనెల 29వ తేది నుంచి జూన్ 2వ తేది వరకు జిల్లాలో శిక్షణలు కొనసాగుతాయన్నారు. మండలస్థాయిలో ఈనెల 31వతేది నుంచి జూన్ 3వ తేది వరకు శిక్షణలు ఇవ్వాలని ఆదేశించారు.

● ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈనెల 31వ తేదిన ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. జూన్ 1 ఆదివారం సెలవు దినం కావటంతో ముందురోజు పింఛను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

బాలల ఆశ్రమాలు చట్ట ప్రకారం నడపాలి

బాలల ఆశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు చట్టప్రకారమే నడిపేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం సీసీఐఆర్‌సీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో 23 బాలల ఆశ్రమాలు, సంరక్షణ కేంద్రాల లైసెన్స్‌ల పునరుద్ధరణకు సంబంధించిన దస్త్రాలను పునఃపరిశీలన చేయాలన్నారు. ఆ సంస్థల పనితీరుపై క్షేత్రస్థాయిలో విచారించి అధికారులు కమిటీకి నివేదించాలన్నారు. జిల్లా అధికారులు సంబంధిత దస్త్రాల నివేదికను పరిశీలించాలన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు



వేమూరు ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

వేమూరు, మే 28(ఆంధ్రజ్యోతి) : తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దశదిశలా వ్యాపింపచేసిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పేర్కొన్నా రు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. జంపనిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ షేక్ హనీఫ్ కేక్ కట్ చేశారు. మండలంలోని 17 గ్రామాల్లో పార్టీ శ్రేణులు జెండాలను ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహాలలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

● అమృతలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూచిపూడిలో యలవర్తి బ్రహ్మానందం, యలమంచిలి జగన్మోహనరావు, మట్లపూడి జయపాల్, తుమ్మల కిషోర్, ఆనంద్, తుమ్మల భుజంగరావు, యలవర్తి జగదీష్, అమృతలూరులో రవీంద్రబాబు, రామాజంనేయులు, తదితరులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు(కొల్లూరు) (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా సూచనల మేరకు సీనియర్ నాయకులు హబీబుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్



రైల్వేస్టేషన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల యువ సేన నాయకులు

రేపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు అన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలను మున్సిపల్, పరిటాల యువసేన కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. పరిటాలయువసేన ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.సాంబశివరావు, చైర్‌పర్సన్ కట్టామంగా, వైస్‌చైర్మన్ టీకేవీగుప్తా, పరిటాల యువసేన అధ్యక్షులు దండమూడిధరణి కుమార్, ఆగస్త్య, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, సజ్జాప్రసాద్, రేపల్లె పాపారావు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శి ఈ విజయబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రేపల్లె నియోజకవర్గం నుంచి కడపలో జరిగే మహానాడుకు 2వ రోజు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె మండలాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడులో పాల్గొనటం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, మొహమాటం రాధాకృష్ణమూర్తి, దివిరాంబాబు, పంతాని సాయికుమార్, దేవగిరిరవి, గోగినేని శ్రీనివాసరావు, ధర్మతేజ, వాకా చిరంజీవి, జీ ఆదినారాయణ, ఆర్ శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. **(రేపల్లె)**

మహానాడులో కొల్లూరు టీడీపీ శ్రేణులు



మహానాడు ప్రాంగణంలో మాజీ ఎంపీపీ మధుసూదనప్రసాద్ తదితరులు

కొల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో కొల్లూరు మండల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. బుధవారం కొల్లూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, మండల గ్రామాల నాయకులు మహానాడుకు తరలి వెళ్లి అక్కడ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రుణాలు అందుతున్నాయా?

● డ్వాక్రా మహిళలను ప్రశ్నించిన కేంద్రబృందం
● చందోలు, ఖాజీపాలెంలో పర్యటించిన సభ్యులు



ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న కేంద్రబృందం

పిట్టలవానిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల ద్వారా డ్వాక్రా రుణాలు సమగ్రంగా అందుతున్నాయా.. లేదా అని మహిళలను కేంద్ర బృందంలోని సభ్యులు అనీల్‌కుమార్, అరుకుమార్ ప్రశ్నించారు. మండలంలోని చందోలు, ఖాజీపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డ్వాక్రా మహిళలు, పింఛన్‌దారులు, ఉపాధి కూలీలతో కేంద్ర బృందం సభ్యులు ప్రత్యేకంగా మాట్లాడారు. తొలుత చందోలులో హౌసింగ్ ద్వారా నిర్వహించే గృహాలను పరిశీలించారు. జీవన విధానం గురించి, వారు పొందుతున్న లబ్ధి గురించి డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించే గోకులం షెడ్లను, ఉపాధిహామీ పథకం కింద నిర్మించి సీసీరోడ్లను కేంద్రబృందం పరిశీలించింది. చందోలు, ఖాజీపాలెం సచివాలయ పరిధిలోని ఏటికట్ట గ్రామం, కళాశాల పక్కన ఉద్యాన శాఖ ద్వారా రైతులు పండించే పంటలను పరిశీలించి, వారు పొందుతున్న లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం వెంట బాపట్ల డ్వామా పీడీ వి.విజయలక్ష్మి, ఏపీడీ సి.హెచ్.సువార్త, సచివాలయాల కార్యదర్శులు బి.సుజాత, దాసరి వెంకటశివకుమార్, తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్



అధికారులతో కలిసి ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జె. వెంకటమురళి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులతో కలిసి ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎండీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం : ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు చెక్ పెట్టేందుకు శక్తివాట్సప్ నెంబర్ అందుబాటులోకి తీసుకురావటం జరిగిందని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని రద్దీ ప్రదేశాల్లో శక్తిబృందాలు గస్తీ నిర్వహించాయి. నాలుగు బృందాలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించటంతోపాటు రైల్వేస్టేసన్‌లు, బస్టాండ్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో గస్తీ నిర్వహించారు. మహిళల భద్రత కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తియాప్ గురించి, శక్తివాట్సప్ నెంబరు 799348511 గురించి అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నవారు ఈ నెంబరుకు కాల్, సాధారణ కాల్, మెసేజ్ చేసిన కంట్రోల్ రూమ్‌కు సంకేతాలు వెళతాయని చెప్పారు. వెంటనే శక్తి బృందాలు స్పందించి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటామన్నారు. ఈ నెంబరు 24 గంటలు అందుబాటులోనే ఉంటుందని తెలిపారు.

ఖేలో ఇండియా బీచ్‌గేమ్స్‌లో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



బీచ్‌గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఖేలో ఇండియా బీచ్‌గేమ్స్‌లో భాగంగా గుజరాత్ రాష్ట్రంలోని డయ్యులో జరిగిన బీచ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరపున బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన సికనం మానసా, సికనం మౌనికలు బీచ్‌వాలీబాల్ నందు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బ్రౌంజ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ జె.వెంకటమురళి ఇద్దరిని అభినందించి భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి స్పోర్ట్స్ కోటాలో అత్యున్నతమైన ఉద్యోగం సాధించాలన్నారు. వీరికి కోచ్‌గా వ్యవహరించిన జిల్లాకోచ్ రాధాకృష్ణ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కె.పాల్ కుమార్‌లకు అభినందనలు తెలిపారు.

భూసార పరీక్షల ద్వారా ఎరువులు వినియోగించాలి

● వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాలకుడు శివన్నారాయణ



ముగింపు సభలో మాట్లాడుతున్న జి.శివన్నారాయణ

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : రైతులు అధిక దిగుబడులు సాధించటానికి భూసారపరీక్షలు ఆధారంగా ఎరువులు వినియోగించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగ సంచాలకుడు జి.శివన్నారాయణ తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో 15రోజులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్రపోషక యాజమాన్యంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల ఏరువాక కేంద్రం, రాష్ట్ర వ్యవసాయ యాజమాన్య, విస్తరణ శిక్షణా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ సహకార సంఘాల నుంచి 30మంది ప్రతినిధులు శిక్షణ తీసుకున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారు రైతులకు తగు సూచనలు చేసి ఎరువుల వినియోగంపై అవాహన కల్పించాలన్నారు. భూసార పరీక్షలు, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ శ్యామ్‌సన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బీచ్ కబడ్డీ క్యాంప్ నిర్వహణ

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33వవార్డు బాలకృష్ణపురం మూడో లైన్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళాబీచ్ కబడ్డీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. జూన్ 4వ తేది వరక ఈ క్యాంప్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి, జిల్లాసెక్రటరి ఎం సుబ్బరాజు తెలిపారు. జూన్ 5వ తేది నుంచి 8వ తేదీ వరకు మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో జరగనున్న 12వ నేషనల్ స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుంచి వీరు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 12మంది క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు. 8 మంది ఎంపికైన క్రీడాకారులు ఆంధ్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, టి.స్వామి, పి.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, కె.అంకమ్మరావు, మహిళా జట్టు కోచ్ శైలజ, ఎం.సాయికుమార్, జి.అమరేంద్ర, ఎం.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పురుషుల జట్టుకు పొన్నపల్లిలో శిక్షణ శిబిరం

చెరుకుపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వతేదీ నుంచి 8వ తేదీ వరకు మచిలీపట్నంలోని మంగినపూడిబీచ్‌లో నిర్వహించనున్న 12వ జాతీయ బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టుకు చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో శిక్షణ శిబిరం ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎం సుబ్బరాజు తెలిపారు. బుధవారం పొన్నపల్లిలో శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వతేదీ నుంచి వచ్చే నెల 3వతేదీ వరకు రాష్ట్ర పురుషుల జట్టుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పొన్నపల్లి గ్రామానికి చెందిన కుంచాల శ్రీనివాసరెడ్డి స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 12మంది క్రీడాకారులు పాల్గొనగా శిక్షణ అనంతరం వీరి నుంచి తుదిజట్టు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఎండీయూ వాహనాల రద్దుకు నిరసనగా ర్యాలీ

వేమూరు, మే 28(ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ పంపిణీ చేసేందుకు జగన్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాహన సౌకర్యాన్ని కూటమి రద్దు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం వేమూరులో వాహనాల యజమానులు, హెల్పర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుశీలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సుజిత్‌కుమార్ మాట్లాడుతూ జగన్ పాలనలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధానంలో భాగంగా పేదలకు రేషన్ పంపిణీకి స్వయంగా వాహన సౌకర్యం కల్పించారని, వాహనాలను అందించడంతో పాటు హెల్పర్లను ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో 9260 మంది వాహనదారులు ఉండగా నియోజకవర్గంలో 50 మంది ఉన్నారని, దాదాపుగా రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందన్నారు. అలాంటి విధానాన్ని రద్దు చేయడం వల్ల వేలాది మంది జీవనోపాధిని కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొనిగల అగస్టీన్. ఆపరేటర్లు రఫీ, అమరేశ్వరరావు, ప్రదీప్, శంకర్ పాల్గొన్నారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి...







పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు








నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

సీటీ శాఖలో.. బదిలీల సందడి

- మార్గదర్శకాల కోసం ఉద్యోగుల ఎదురుచూపులు
- వైసీపీ హయాంలో సంస్కరణల పేరుతో అడ్డగోలు విభజన
- బదిలీలతోనైనా న్యాయం జరుగుతుందని నమ్మకం
- పదోన్నతులపై ఉద్యోగుల ఆశలు



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

గుంటూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కమర్షి యల్ టాక్స్ (సీటీ) శాఖలో ఉద్యోగుల బదిలీల సందడి ప్రారంభమైంది. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా వాణిజ్యపన్నులశాఖలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంది. జూన్ రెండో తేదీ నాటికి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. కాగా బదిలీల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో నేటికీ మార్గదర్శకాలు విడుదల కాకపోవటంపై ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. సీటీశాఖకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలు జరగనున్నాయి. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీటీ శాఖలో సంస్కరణల పేరుతో అడ్డగోలుగా ఉద్యోగులను విభజించారు. రాష్ట్రంలో రీజనల్ కార్యాలయాల పేరుతో విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలకు గుంటూరు జోన్‌పరిధిలోని ఉద్యోగులను కేటాయించారు. ఫలితంగా గుంటూరు జోన్ పరిధిలోని గుంటూరు-1, 2 డివిజన్‌లతో పాటు ఒంగోలు, నెల్లూరు డివిజన్‌లలోని పలువురు ఉద్యోగులు ఏకంగా జిల్లాలు దాటి బదిలీపై వెళ్లాల్సి వచ్చింది. తాజా బదిలీల్లోనైనా ఆర్‌వో కార్యాలయాలకు వెళ్ళిన ఉద్యోగులు తిరిగి సొంత డివిజన్‌లకు రావచ్చన్న ఆశల్లో ఉన్నారు. బదిలీల్లో తమకు కోరుకున్న స్థానాలకు వచ్చేందుకు ఉద్యోగులు విశ్వప్రయత్నాల్లో ఉన్నారు. మార్గదర్శకాల కోసం ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే గుంటూరు జోన్‌పరిధిలో నాలుగు డీసీటీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతున్నారు. 11 జీఎస్‌టీవో పోస్టులకు సంబంధించి పదోన్నతులు కల్పించాల్సి ఉందని తెలిపారు. బదిలీలపై ఆర్‌వో కార్యాలయాల నుంచి, ఇతర డివిజన్‌ల నుంచి అర్హులైన జీఎస్‌టీవోలు రావాల్సి ఉండగా, మరో ఐదుగురికి పదోన్నతి కల్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

పదోన్నతులపై ఉద్యోగుల్లో ఆశలు

గుంటూరు జోన్ పరిధిలో ఖాళీగా ఉన్న డీసీటీవోలు, జీఎస్‌టీవోల పోస్టులకు పదోన్నతులపై ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో గుంటూరు జోన్ నోడల్ జాయింట్ కమిషనర్‌గా ఓంకారరెడ్డి హయాంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులను భారీగా పూర్తి చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పదోన్నతుల ఊసే లేదని ఉద్యోగులు గుర్తుచేస్తున్నారు. జోన్ పరిధిలో అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తారా.. లేదా అన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెట్టుకున్నారు. ముందు పదోన్న తులా... లేదా బదిలీలా అని అర్హులైన ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సంచలన కేసు.. సీఐతో విచారణా?

జంట హత్యలపై దర్యాప్తులో అధికారుల తీరుపై సందేహాలు

మాచర్లటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యంత సమస్యాత్మకమైన మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన జంట హత్యల కేసు రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచేలోపే టీడీపీకి చెందిన ఇరువురు నేతలను అత్యంత పాశావికంగా హత్య చేయడం గమనార్హం. ఈ హత్య విచారణ సీఐ, ఎస్ స్థాయి వ్యక్తులతో కొనసాగిస్తున్నారు. జంట హత్యలు ఈనెల 24వ తేదీ సాయంత్రం బైకుపై వెళ్తున్న టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్య, అతని సోదరుడు కోటేశ్వరరావులను పథకం ప్రకారం ప్రస్తుతం ఇదే పార్టీలో ఉన్న ప్రత్యర్థులు రెక్కి నిర్వహించి పక్కా సమాచారంతో బోదలవీడు గ్రామ శివారులో స్కార్పియో వాహనంతో ఢీకొట్టించి పడిపోయిన పిదప బండరాళ్లతో మోది హత్య చేసి పారిపోయారు. ఈ సంఘటనపై ఇటు అధి కార పార్టీ ముఖ్యమంత్రి, అటు ప్రతిపక్ష పార్టీ మాజీ ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన ఈ కేసు విచారణ కిందిస్థాయి అధికారులకిచ్చి దర్యాప్తు చేపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు కేసుల్లో...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల ఒంగోలులో టీడీపీకి చెందిన ముప్పవరపు వీరయ్యచౌదరి హత్య కేసు సంచలనం కలిగించింది. ఆర్థిక, రాజకీయ కారణాలతో జరిగిన ఈ హత్య మూలాలను, దోషులను పట్టుకునేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ జరిపించి నిగ్గు తేల్చారు. అలాగే నెల్లూరు జిల్లాలో ఫైనాన్షియల్ సెటిల్‌మెంట్‌లో జరిగిన ఓ హత్య కేసు మిస్టరీని చేధించేందుకు డీఎస్పీ స్థాయి అధికారిణి నియమించారు. అలాగే నరసరావుపేటలో సాయిసాధన చిట్‌ఫండ్ కంపెనీ కుంభకోణంలో సీఐడీ పర్యవేక్షణకు ప్రత్యేక దర్యాప్తు బృంద అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిణి నియమించారు. కానీ మాచర్ల నియోజకవర్గంలో జరిగిన జంట హత్యల కేసులో విచారణ కిందిస్థాయి అధికారులకిచ్చి జరిపించడంపై పల్నాడు ప్రజలు పెదవి విరుస్తున్నారు. కేసును త్వరితగతిన విచారణ జరిపి దోషులను పట్టుకొని చట్టం ముందు నిలబెట్టాలని పల్నాడు ప్రజలు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించండి

● జిల్లా జడ్జి కల్యాణ చక్రవర్తి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి

గుంటూరు(లీగల్), మే 28(ఆంధ్రజ్యోతి): జూలై 5న జరగబోవు లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ఆక్సిడెంట్, ఫైనాన్స్ కంపెనీల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ సాయి కల్యాణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం ఆయన తన తోటి అదనపు జిల్లా జడ్జిలతో కలిసి ఇన్సూరెన్స్, ఫైనాన్స్ కంపెనీల అధికారులు, కంపెనీ న్యాయవాదు లతో సమావేశం నిర్వహించారు. వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి వారి సహకారంతో కేసుల సత్వర పరిష్కారానికి తీసు కోవలసిన చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో అదన పు జిల్లా జడ్జిలు వి.ఎ.ఎల్.సత్యవతి, జీ చక్రపాణి, రుద్రపాటి శరత్ బాబు, కే నీలిమ, సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు , షమీ పర్వీన్ సుల్తానా బేగం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై సూర్యనారాయణతో పాటు పలు ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు న్యాయవాదులు పాల్గొన్నారు.

9 లక్షల మందికి యోగాపై అవగాహనే లక్ష్యం

◆ యోగాంధ్ర-2025లో ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ◆ ఉండవల్లి గుహల వద్ద ఆసనాలు


యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ, చిల్లపల్లి, అధికారులు

తాడేపల్లి (ఉండవల్లి), మే 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ అన్నారు. తాడేపల్లి మండలం లోని ప్రపంచ ప్రఖ్యాత ఉండవల్లి గుహలవద్ద బుధవారం నిర్వ హించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావులు పతంజలి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా శిక్షకులు అందరితో యోగా చేయించారు. ఈ సందర్భంగా భార్గవతేజ మా ట్లాడుతూ జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర 2025 ద్వారా రాష్ట్ర ప్రజల కు మే 21 నుంచి జూన్ 21వరకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఉండవల్లి గుహ ల వద్ద ఐదు వందల మందితో యోగా కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ఆధ్యాత్మిక ప్రదేశాలకు గుర్తింపు తీసుకురావడమే యోగాంధ్ర 2025 ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మందికి యోగాపై అవగాహన కల్పించడం సీఎం చంద్రబాబు ఉద్దేశ్య మన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల జిల్లా స్థాయిలో 9 లక్షల మందికి యోగాపై అవగాహన కల్పించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి, ఆర్థిక పరమైన సమస్యల ఒత్తిడి అనేది సర్వసాధారణంగా మారిపోయిందని, ఈ పరిస్థితుల్లో రోజూ ఒక అర్ధగంట యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా టూరిజం ఆఫీసర్ శ్రీరమ్య, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ అనిత, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాష, అసిస్టెంట్ కమిషనర్ జీ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తాడేపల్లి తహశీల్దార్ డీ సీతారామ య్య, ఏఈలు, డీఈలు, సర్వేయర్లు సచివాలయ సిబ్బంది, వివిధ కాలేజిల విద్యార్థులు, యోగా ట్రైనర్లు, ఎన్‌డీఏ కూటమి నేతలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్‌గా విజయలక్ష్మి



గుంటూరు(లీగల్), మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్‌గా కుమ్మమూరు విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న సునీత నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని హైకోర్టు రద్దు చేయడంతో ఆమె స్థానంలో ప్రస్తుతం కమిషన్ సభ్యురాలుగా 2022 ఫిబ్రవరి 22 నుంచి పనిచేస్తున్న విజయలక్ష్మికి అఫీషియేట్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. నాగార్జున యూనివర్సిటీలో బీకాం డిగ్రీ చదివిన ఆమె కర్ణాటకలోని గుల్బర్గా యూనివర్సిటీలో 1991లో న్యాయ శాస్త్రంలో పట్టాపుచ్చుకున్నారు. 1992లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో న్యాయ వాదిగా నమోదై తన అన్న కుమ్మమూరు కృష్ణ కిషోర్‌తో కలిసి న్యాయవాదిగా గుంటూరు జిల్లా కోర్టులలో న్యాయవాదిగా పనిచేశారు. 22 ఫిబ్రవరి 2022 నుంచి జిల్లా కన్స్యూమర్ కమిషన్ సభ్యురాలిగా నియమితులై పనిచేస్తున్నారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

పెదనందిపాడు, గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో వృద్ధురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు పాలపర్తి మంజు (21)కు కోర్టు ఐదేళ్ళ జైలు... రూ.ఐదువేల జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే...... 2024 మార్చి నెలలో పెదనందిపాడులో ఒంటరిగా నివాసం ఉంటున్న 85 సంవత్సరాల వృద్ధురాలిపై తెల్లవారు జామున సుమారు 3.00 గంటల సమయంలో ఆమె నివాసం ఉంటున్న పూరి గుడిసెలోకి అదే గ్రామానికి చెందిన పాలపర్తి మంజు అనే అతను అక్రమంగా ప్రవేశించి ఆమెపై దాడి చేసి ఆమెను బలాత్కారం చేయబోయాడు. వృద్ధురాలు నిందితుడిని గట్టిగా నెట్టి పెద్దగా కేకలు వేయగా అతడు అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జరిగిన ఘటనకు సంబంధించి అప్పటి పెదనందిపాడు ఎస్సై రాజ్ కుమార్ పలు సెక్షన్ల కింద అత్యాచార యత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును సమగ్ర విచారణ జరిపి భౌతిక, సాంకేతిక ఆధారాలను "మహిళపై జరిగిన నేరాలను విచారించే 5వ అదనపు న్యాయస్థానం" వారికి సమర్పించగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కే నీలిమా నిందితుడిని నేరస్తుడుగా నిర్ధారించి అతనికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. ఐదువేలు జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నేరం జరిగిన కేవలం 15 నెలల్లోనే నిందితునికి శిక్షపడే విధంగా పోలీసులు కృషి చేసారన్నారు. నిందితుడికి శిక్షపడుటలో తమ వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణారావును, కేసుకు సంబంధించిన విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన సీఐ నరసింహారావును, ప్రస్తుత పెదనందిపాడు ఎస్సై మధుపవన్‌ను, కోర్టు కానిస్టేబుల్ షడ్రక్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు









నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం...


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

మద్దతు.. మమ

(5వ పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నది. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 విదిల్చిందని రైతులు వాపోతున్నారు. ఎంతో కాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369కి పెంచింది. కింటా ధాన్యం మద్దతు ధర రూ.500 నుంచి 600 వరకు పెంచి ఉంటే మేలు జరిగి ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. కందులకు క్వింటాకు రూ.7550 నుంచి రూ.8000కు, పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7121 నుంచి రూ.7710కి పెరిగింది. మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2225 నుంచి 2400కి పెంచించారు. మొక్కజొన్న, పత్తి, కందికి కూడా ఇంకా మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. మినుములు క్వింటాకు రూ.400, జొన్నలు క్వింటాకు రూ.328 మద్దతు ధర పెరిగింది.

నీటి కుంట.. ఉపాధికి తంటా

(5వ పేజీ తరువాయి)

కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు, రైతులకు నీటి వసతి ఉంటుందని భావించింది. అయితే పొలంలో చెరువు వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించి నిర్మాణానికి అంగీకరించేలా రైతులను చైతన్య పరచడంలో యంత్రాంగం విఫలమైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 12,000 పొలం చెరువులు నిర్మించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 1,513 చెరువులను మాత్రమే నిర్మించారు. పనులు చేపట్టడంలో నెలకొన్న నిర్లక్ష్యం ఉపాధి కార్మికులకు శాపంగా మారింది. గ్రామంలోనే పనులు లభించే పరిస్థితికి వారు దూరమయ్యారు. చెరువుల నిర్మాణం అంతంతమాత్రంగా ఉండటంతో కార్మికుల ఉపాధికి గండిపడింది.పల్నాడు జిల్లాలో 6,500 నీటి కుంటలకు 4,528 నీటి కుంటలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీటిలో 1,663 కుంటలకు 777 మాత్రమే అంటే 17.16 శాతం పూర్తి చేసినట్లు డ్వామా అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 1,500 నీటి కుంటలు లక్ష్యం కాగా 776 మంజూరయ్యాయి. వీటిలో 100 అంటే 12.89 శాతం పనులు పూర్తయ్యాయి. బా పట్ల జిల్లాలో 4,000 సేద్యపు నీటి కుంటలకు 2,298 మంజూరు చేశారు. వీటిలో 636 అంటే 26.60 శాతం నిర్మించారు.

కదిలేదే లేదు

(5వ పేజీ తరువాయి)

ఒక ఏడీఏను నియమించినా జాయిన్ కాకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే మండల వ్యవసాయ అధికారి ఏడీఏగా కొనసాగుతూ ఉన్నారు. 17 ఏళ్ల నుంచి ఓడీపై కొనసాగుతున్న నిర్వాహకం తేటతెల్లమవుతోంది.

వైసీపీ నేపథ్యం ఉన్నా లేఖలు..

గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఓ అధికారికి గుంటూరు రూరల్ మండలంలోని వైసీపీ ముఖ్య నేతలతో బంధుత్వం కూడా ఉంది. అదే అధికారి గతంలో ఈ ప్రాంతంలో పనిచేసినప్పుడు అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. ఇప్పుడు అదే అధికారిని గుంటూరు ఏడీఏ నియమించాలని సిఫార్సు లేఖలు ఇవ్వడం వివాదాస్పదమైంది. పూర్తిగా వైసీపీ నేపథ్యం ఉన్న వారికి సిఫార్సు లేఖలు ఇవ్వడంపై వ్యవసాయ శాఖలోని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ అధికారి టీడీపీకి అనుకూలమని ఆయన్ను బలవంతంగా తొలగించారు. ఆయన్ను అదే పోస్టులో కొనసాగించాలని ఓ సీనియర్ ఎమ్మెల్యే లేఖ ఇచ్చిన తర్వాత కూడా సుదూర ప్రాంతానికి పంపారు. కొందరు వ్యక్తులు అధికారుల విషయంలో ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లోని సిబ్బందిని పక్కదారి పట్టించి ఇటువంటి బదిలీలకు శ్రీకారం చూడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టోటల్‌గా కలెక్షన్...

అయితే ప్రస్తుతం వ్యవసాయ శాఖలో జరుతున్న బదిలీల ప్రక్రియపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఎన్ని సిఫార్సు లేఖలు ఉన్నా కొందరు అధికారులు కప్పం చెల్లించాల్సిందే అని ముఖం మీదే చెబుతున్నట్లు తెలుస్తుంది. అదేమంటే ఓ ముఖ్యమైన వ్యక్తిని లైన్‌లో పెట్టి మాట్లాడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కోవర్టులపై కన్నెర్ర

(5వ పేజీ తరువాయి)

కోవర్టులు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. మాచర్ల జంట హత్యల ఉదంతంతో కోవర్టుల తీరును గమనించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడపలో మహానాడు వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పార్టీలో కొంతమంది ప్రత్యర్థులతో చేతులు కలిపి మనమధ్య కోవర్టులుగా ఉంటున్నారు.. వైసీపీ నేతల ప్రోత్సాహంతో హత్యా రాజకీయాలు చేస్తున్నారు.. ఇలాంటి తప్పుడు పనులు చేసే ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టను.. గుడ్డిగా ఇక ఎవరినీ నమ్మం.. అంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. దీంతో వైసీపీకి కోవర్టులుగా వ్యవహరిస్తున్న చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి నేతల వరకు వణికిపోతున్నారు.

నామినేటెడ్ పదవుల వైపు చూపు..

అధికారం వచ్చాక కొందరు.. అధికారం వస్తుందని ముందే గ్రహించి ఎన్నికలకు కొద్ది రోజుల ముందే కూటమి నీడకు వచ్చిన నేతల్లో కొందరు ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ఆయన అరాచక బ్యాచ్‌కు కోవర్టులుగా వ్యవహరిస్తున్నారు. వీలైతే హత్యలు, లేకుంటే దాడులు చేస్తూ దానికి ఆధిపత్య పోరుగా రంగు పులుముతూ కోవర్టులమనే విషయం బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరిలో కొందరైతే నామినేటెడ్ పదవులపై కూడా కన్నేశారు. దీంతో పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉంటూ ఆర్థికంగా తోడ్పాటు అందించిన వారిని పక్కకునెట్టి పదవులు చేజిక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. తమలాగా పార్టీ కోసం పాటు పడిన వారిలో ఎవరికి పదవి దక్కినా సంతోషిస్తాం కానీ కోవర్టులకు పదవులు దక్కితే తాము తలెత్తుకొని ఎలా తిరగ్గలమని పార్టీ వీరాభిమానులు ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు హెచ్చరికతో ఈ కోవర్టుల బెడద వీడుతుందేమో చూడాలి.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

● నివాళులు అర్పించిన రాజకీయ నేతలు, అధికారులు


బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

చీరాల , మే 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. టీడీపీ నేతల ఆధ్వర్యంలో పార్టీ క్యాంపు కార్యాలయం, బస్టాండ్, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం, నాదెండ్ల కోటేశ్వరరావు, శ్రీరాం రమేష్, తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, ఆవుల అశోక్, తేజ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో

చీరాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కారంచేడు(పర్చూరు): : కారంచేడులోని కాలువ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అణు శాస్త్రవేత్తగా పుల్లాయిపాలెం వాసి


నక్కల సాంబశివరావు

గవినివారిపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం గవినివారి పాలెం పంచాయతీ పుల్లాయిపాలెంకు చెందిన నక్కల సాంబశివరావు ప్రభుత్వ బార్క్(బాబా అటమిక్ రీసెర్ఛ్ సెంటర్)కు అణు శాస్త్రవేత్తగా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలయిన గేట్, సీటీటి పరీక్షల్లో దేశ వ్యాప్తంగా 289వ ర్యాంకు సాధించాడు. అంతేకాకుండా బార్క్ నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొని సత్తా చాటి ఏ గ్రేడ్‌లో శాస్త్రవేత్తగా ప్రతిభ కనబరిచాడు. బాపట్లలో హైస్కూల్ స్థాయి, నాగార్జున సాగర్ ఆర్జేసీలో ఇంటర్, విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాడు. ఈక్రమంలో గ్రామానికి వన్నె తెచ్చిన సాంబశివరావును గ్రామస్థులు అభినందిస్తున్నారు.

కారును ఢీకొన్న స్కూటీ

● ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలు

యద్దనపూడి,(మార్టూరు)మే28(ఆంధ్రజ్యోతి): కారును స్కూటీ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన బుధవారం మధ్యాహ్నం చిలకలూరిపేట,గుంటూరుల మధ్య జాతీయరహదారిపై బోయపాలెం వద్ద జరిగింది. అందిన సమాచారం మేరకు యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల హరిణి ఇంజనీరింగ్ చదువుతుండగా, ఆమె స్నేహితురాలు సౌమ్య ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు.ఇద్దరు యువతుల కుటుంబాలు చిలకలూరిపేట లో నివాసం ఉంటున్నారు.వారు స్కూటీ పై జాతీయ రహదారిపై గుంటూరు నుంచి చిలకలూరిపేటకు వస్తూ కారును ఢీ కొన్నారు.దాంతో వారిద్దకి తీవ్రగాయాలయ్యాయి. అనంతరం వారిని హైవే అంబులెన్స్‌లో గుంటూరు లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం వారిద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఇంకొల్లు, పర్చూరు రోడ్డు పనులకు భూమిపూజ

ఇంకొల్లు,మే 28,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు, పర్చూరు రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఇంకొల్లులోని పర్చూరురోడ్డులో వైజంక్షన్ వద్ద భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో కూటమి ప్రభుత్వం ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రోడ్డు అభివృద్ధి చేసేందుకు రూ.23.88 కోట్లు మంజూరు చేసింది.ఈ సందర్భంగా డీఈ నళిణి మాట్లాడుతూ శరవేగంతో పనులు ప్రారంభించి త్వరతిగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.10 మీటర్ల వెడల్పుతో రోడ్డును విస్తరించి నిర్మాణం చేస్తామన్నారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలేరు రామకృష్ణ, కొల్లూరి శివాజీ, వెంకటకృష్ణ, బేతపూడి సురేష్ , అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి

మార్టూరు, మే28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతి ఇల్లు,వీధి పరిశుభ్రతగా ఉండాలంటే ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని మండల విస్తరణ అధికారి పి. రామాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామ పంచాయతీ వద్ద స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, ముఖ్య అతిథిగా విచ్చేసిన విస్తరణ అధికారి రామాంజనేయులు మహిళలకు చెత్తవేసే బుట్టలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు,సచివాలయ సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తీవ్ర గాయాలతో అపస్మారస్థితిలో ఉన్న తల్లీ కొడుకు

కారు ఢీకొని తల్లీ,కుమారుడికి తీవ్ర గాయాలు

అక్కయ్యపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళుతున్న తల్లీ కుమారుడిని వేగంగా కారు ఢీ కొంది. ఈ ఘటన బుధవారం రాత్రి చీరాల - వేటపాలెం మధ్య గల అక్కయ్యపాలెం జంక్షన్ 216 జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల శాంతినగర్‌కు చెందిన ఐనంపూడి రత్నకుమారి భర్త, కుమారుడు జ్యోయల్‌తో వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం కోళ్ల పెంపకం వద్ద ఉంటున్నారు. ద్విచక్ర వాహనంపై కుమారుడితో తల్లి చీరాల వైపుకు వస్తుండగా చీరాల నుంచి పని ముగించుకుని ఒంగోలుకు వెళుతున్న ఇన్నోవా కారు వీరిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాల్లోకి ఎగిరి పొలాల్లో పడ్డారు. దీంతో తల్లికి కుడి కాలు తొంటి భాగం పూర్తిగా దెబ్బతింది. అలాగే కుమారుడికి కుడి కాలు, చేయి దెబ్బతిన్నాయి. స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఘటనపై వేటపాలెం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

ఉప్పుటూరు(పర్చూరు), మే 28 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరుతున్నాయి. వనరుల్లో నీరు అడుగంటంతో ఎద్దడి వస్తుందని ప్రజలు ఒకింత ఆందోళన చెందారు. అయితే అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి సాగర్ నీటిని విడుదల చేసింది. దీంతో ఆ జలాలు చెరువులకు చేరుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు మండల నూతలపాడు మైనర్ ద్వారా 150 కూసెక్కుల పరిమాణంలో నీటి సరఫరా జరుగుతున్నదని నీటిపారుదలశాఖ ఏఈ సుబ్బారావు తెలిపారు.


ఉప్పుటూరు చెరువుకు చేరుతున్న సాగర్ నీరు

ఆంధ్రుల అభిమాన నటుడు నందమూరి

అద్దంకిటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాననటుడు నందమూరి తారక రాముడని, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశ ప్రజలకు చాటిన రాజకీయ నాయకుడని వక్తలు కొనియాడు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో బుధవారం సాయంత్రం ప్రతిభామూర్తులు-మధుర స్మృతులు సభ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా ఎన్టీఆర్‌కు నివాళి

మేదరమెట్ల: రావినూతలల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నేతలు నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువత జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మేదరమెట్ల, పమిడిపాడు, దైవాలరావూరు, తదితర గ్రామాలలో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రావినూతలలో అన్నదానం నిర్వహించారు.


రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలుగుదేశం శ్రేణులు

అవీ.. ఇవీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేఈ భీమానాయక్

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 28(ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించు కోవాలని చినగంజాం విద్యుత్ శాఖ జేఈ బీమానాయక్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన బుధవారం డ్వాక్రా మహిళలకు పీఎం సూర్యఘర్ సోలార్ పథకంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బీమానాయక్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇంటిలో 2 కే.ఎం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలరూపాయిల నుంచి రూ.60 వేల రూపాయిల వరకు, 3 కేఎం ఏర్పాటు చేసుకుంటే రూ.75 వేల రూపాయిల వరకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. దీని వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఎం.సూర్య ఘర్ ఏర్పాటు చేసుకునేవారికి అవసరమైన రుణం బ్యాంకు ద్వారా గాని, శ్రీనిధి, సీఐఎఫ్, పొదుపు ద్వారా గాని ఇప్పిస్తామని ఏపీఎం తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రూపుల్లో ఉన్న ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కె.వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మండలంలోని భగవాన్‌రాజుపాలెంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు

బీఆర్‌పాలెంలో శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 16వ జాతీయ రహదారి నుంచి గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయం వరకు 150 మీటర్ల పొడవున, 5.2 మీటర్ల వెడల్పుతో సీసీరోడ్డును విశాలంగా నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి చేరుకునే ఈ ప్రధాన రహదారి గోతులమయం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని గుర్తించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షల ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా చేయిస్తున్నారు. రహదారి నిర్మాణానికి సహకరించిన మంత్రి గొటట్టిపాటి రవికుమార్‌కు స్థానిక టీడీపీ నేతలు నార్నె సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, పెద్దన్నలు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి

రుతుస్రావ సమస్యలను అధిగమించాలి

- జిల్లా వైద్యాధికారిణి విజయలక్ష్మి

కావూరివారిపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు రుతుస్రావ సమయంలో ఒత్తిడికి లోనవక సమస్యను అధిగమించాలని జిల్లా వైద్యాధికారిణి డా. విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ ఆంధ్రకేసరినగర్‌లో గ్రామ వికాస్ పీస్ ఫౌండేషన్, సీబీఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమానికి డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సందేహాలను నివృత్తి చేశారు. మహిళలకు స్వచ్ఛంద సంస్థ సహాయంతో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

విధుల్లో అలసత్వం తగదు

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించరాదని, నిర్దేశించిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో నివేశన స్థలాలు మంజూరు చేసేందుకు చేపట్టిన స్థల సేకరణపై ఆరా తీశారు. అలాగే రీ సర్వేపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదంచేయండి

వచ్చే నెలలో నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని ఎంపీడీవో రాజేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ మాల్యాద్రి, టీడీపీ కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు

మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం ప్రదేశంలో అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం, ఈదురు గాలుల కారణంగా కొత్తపాలెంలో ఓ టిఫిన్ హోటల్‌పై విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈక్రమంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించారు.

31న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ నెల 31వ తేదీన పంపిణీ చేస్తామని ఎంపీడీవో స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో 7,774 మంది లబ్ధిదారులకు రూ. 3,24,43,500ల మొత్తాన్ని శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గోకులాల బిల్లుల కోసం ఎదురు చూపులు

నిర్మాణం పూర్తయి నాలుగు మాసాలు

జరగని చెల్లింపులు

పశుపోషకుల ఆవేదన

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకు కోసం లబ్ధిదారులకు పెద్ద ఎత్తున రాయితీని కూడా ప్రకటించింది. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత సిబ్బంది పశుపోషకులకు అవగాహన కూడా కల్పించారు. పశువులకు సౌకర్యంగా ఉండటంతోపాటు, ప్రభుత్వ రాయితీ కూడా వస్తుందని ఆశతో ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా పశుపోషకులు పశుసంవర్థక శాఖ నుంచి అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేశారు. రెండు పశువులకు రూ.1.15 లక్షలు,



అడుసుమల్లిలో పూర్తిచేసుకున్న మినీ గోకులం

నాలుగు పశువులకు రూ.2.30 లక్షలు చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. అందులో 90శాతం ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించింది. నిర్మాణం పూర్తి అయిన తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లించే విధంగా కార్యాచరణ కూడా రూపొందించింది. దీంతో పూర్తిచేసుకున్న వెంటనే బిల్లులు వస్తాయన్న ఆశతో పశుపోషకులు యద్ధప్రాతిపదికన నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. అయితే పనులు పూర్తిఅయి నాలుగు మాసాలు గడుస్తున్నా బిల్లులు అందకపోవటంతో పశుపోషకులు నైరాశ్యానికి గురవుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న వెనువెంటనే బిల్లులు వస్తాయని అధికారులు చెప్పటంతో అప్పుచేసి మరీ మినీ గోకులాలను నిర్మించుకున్నామని పశుపోషకులు అంటున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకోవటంతో ఆర్థికభారం పెరిగి పోతుందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి నిధులు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు వేడుకుంటున్నారు.

అద్దంకి మెప్మాలో ఆర్పీ రుణ మోసం

మరో మహిళతో కలిసి బ్యాంకులో తీసుకున్నవైనం

సీవో విచారణ

తిరిగి చెల్లించేందుకు హామీ

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని మెప్మాలో పనిచేసే ఓ ఆర్‌పీ తాను సభ్యురాలుగా ఉన్న ఆదర్శ పొదుపు సంఘంలో సభ్యులకు తెలియకుండా బ్యాంక్ నుంచి అదనంగా రూ.4 లక్షల రూపాయల రుణం తీసుకోవడంపై ఆందోళన రేగింది. వివరాలలోకి వెళితే అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీలో ఆదర్శ పొదుపు సంఘం సభ్యులు బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు.ఆ రుణానికి సంబంధించి కొద్దిమేర మాత్రమే బకాయి ఉండటంతో అది చెల్లించి తిరిగి రుణం తీసుకుందామని బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ బకాయి వివరాలను పరిశీలించగా మూడు లక్షల రూపాయలు ఉండాల్సి ఉండగా 7 లక్షల రూపాయలుగా ఉంది. దీంతో ఒక్క సారి గా ఆందోళనకు గురైన సభ్యులు మెప్మాసీవో శ్రీలత దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆమె బ్యాంక్ లావాదేవీలు పరి



ఆర్పీ మోసంపై ప్రశ్నిస్తున్న పొదుపు సభ్యురాలు

శీలించగా మలాది గాయత్రి ఈ ఏడాది ఫిబ్రవరి 11 వ తేదీన 4 లక్షల రూపాయలు రుణం తీసుకున్నట్లు తేలింది. దీనికి తోడు మూడు నెలలుగా గాయత్రి మెప్మా కార్యాలయానికి కూడా రాకుండా వేరే గ్రామానికి వెళ్లింది. దీంతో కుటుంబసభ్యుల ద్వారా బుధవారం అద్దంకి మెప్మా కార్యాలయానికి పిలిపించారు. సభ్యుల సమక్షంలో మెప్మాసీవో శ్రీలత విచారించగా మరో పొదుపు సంఘానికి చెందిన అంజమ్మ అనే మహిళ సలహాతో 4 లక్షల రూపాయలు రుణం తీసుకున్నట్లు ఒప్పుకుంది. ఆ 4 లక్షల రూపాయలు తనకు ఇచ్చినట్లు అంజమ్మ కూడా ఒప్పుకుంది. దీంతో తీసుకున్న 4 లక్షల రూపాయలను వడ్డీతో పది రోజులలో చెల్లించే విధంగా ఆర్‌పీ గాయత్రి, మరో పొదుపు సంఘం సభ్యురాలు అంజమ్మల చేత ఒప్పందం కుదిర్చినట్లు సీవో శ్రీలత తెలిపారు. అయితే అంజమ్మ సభ్యురాలు గా ఉన్న పొదుపు సంఘానికి సంబంధించి ఇటీవల 20 లక్షల రూపాయల రుణం తీసుకోగా గత రెండు, మూడు నెలలుగా చెల్లింపులు జరగకపోవటంతో ఆ రుణం చెల్లింపులో కూడా ఏమైనా జరిగిందా లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



కడప మహానాడులో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విద్యుత్ రంగాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది

● మహానాడులో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా విద్యుత్ రంగం కీలకం అని సీఎం చం ద్రబాబునాయుడు చెబుతుంటారని విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. దేశంలో మొట్టమొదట సారి విద్యుత్ సంస్కరణ లు తీసుకు వచ్చింది చంద్రబాబునాయుడు అనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా రాష్ట్రంలో మిగులు విద్యుత్ తీసుకు వచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో విద్యుత్ వ్యవస్థ ను సర్వనాశనం చేయటమే కాకుండా చార్జీలను 9 సార్లు పెంచిందన్నారు. విద్యుత్ కోతలు విధించారన్నారు. ఇప్పటికి కూడా ఆ విద్యుత్ చార్జీలను మోయాల్సిన పరిస్థితి జగన్‌రెడ్డి తీసుకు వచ్చారని విమర్శించారు. అలాగే రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులను తరమికొట్టిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు.

అన్నా మన్నించు...

● ఏడేళ్లుగా చెట్టు కిందనే విగ్రహాలు

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని కలవకూరు రోడ్డు కూడలి లో ఏడు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణ కోసం తొలగించిన ఎన్‌టీఆర్, పరిటాల రవి విగ్రహాలు తిరిగి ఏర్పాటు చేయలేదు. దీంతో ఏడు సంవత్సరాలుగా సమీపంలో రెండు విగ్రహాలు చెట్టు కింద గోడకు నిలబెట్టి ఉన్నాయి. బుధవారం ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా తెలుగు ప్రజలు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఈ వి గ్రహాల గురించి పట్టించుకున్నవారు కరువయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిపోయినా ఇంకా ఎన్‌టీఆర్, పరిటాల రవీంద్రల వి గ్రహాల ఏర్పాటుపై తెలుగు తమ్ముళ్లు, నేతలు దృష్టి సారించకపోవటం విమర్శలకు తావిస్తోంది. బుధవారం కనీసం ఆ విగ్రహాలకు కొత్తగా దండలు కూడా వేయకపోటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



చెట్టు కింద గోడకు ఆనించిఉన్న ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలు

మోటార్‌బైక్‌లను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొనటంతో ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. కొరిశపాడు మండలం తమ్మవరంకు చెందిన కరిచేటి వెంకటరావు(41),



ప్రమాదంలో మృతిచెందిన కరిచేటి (ఇన్‌సెట్లో) వెంకట్రావు ఫైల్

అద్దంకి మండలం కలవకూరుకు చెందిన లక్ష్మీపతిలు బుధవారం మధ్యాహ్నం శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువు వద్ద నుంచి వేర్వేరు బైక్‌లపై అద్దంకి వస్తుండగా మార్గమధ్యంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరావు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన లక్ష్మీపతిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కరిచేటి వెంకటరావు చేపల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో భవనాసి చెరువు వద్దకు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు.

వెంకటరావు మృతి బాధాకరం -మంత్రి రవికుమార్

రోడ్డు ప్రమాదంలో వెంకటరావు మృతి చెందటం బాధాకరం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఫోన్ చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

తమ్మవరంలో విషాదఛాయలు

మేదరమెట్ల : శింగరకొండ అద్దంకి రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్మవరం గ్రామానికి చె ందిన కరిచేటి వెంకట్రావు మృతి చెందాడు. తమ్మవరం తెలుగుదేశం నాయకుడు కరిచేటి రాంబాబు తమ్ముడు అయిన వెంకట్రావు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మండలంలోని తెలుగుదేశం నేతలు వెంకట్రావు మృత దేహానికి నివాళులర్పించారు. రాంబాబును పరామర్శించి ధైర్యం చెప్పారు.

టిప్పర్ తగిలి అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

- యువకునికి తీవ్ర గాయాలు

చీరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనానికి టిప్పర్ చక్రం తగిలి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన బుధవారం మధ్యాహ్నం పర్చూరు - చీరాల రోడ్డులోని బ్రైడ్ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పర్చూరుకు చెందిన దుడ్డు దినేష్ స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై చీరాలకు వస్తున్నాడు. వీరి పక్కనే వెళుతున్న టిప్పర్ చక్రానికి వాహనం నడుపుతున్న దినేష్ కాలు తగిలి వాహనం అదుపు తప్పింది. ప్రమాదంలో దినేష్ కుడి కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు,మే28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన బిరుదు స్వామి (42) అనే దివ్యాంగుడు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. గతంలో జరిగిన ఓ ప్రమాదంలో స్వామికి ఓ కాలు తొలగించారు. ఈ నెల 26 వతేదీన మంచంపై నుంచి కిందకు దిగుతూ కట్టెలపొయ్యిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో అతనిని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుబ్బాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,మృతదేహానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన పర్చూరు - చీరాల రోడ్డులోని స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం సమీపంలో మంగళవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ఒక గేదెతోపాటు, మరో దూడకూడా మృతి చెందింది. అయితే గేదెలు ఎవరివి అనేది తెలియాల్సి ఉంది.

టీడీపీ సైనికులకు మహానాడు పెద్ద పండుగ

యోగా తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సైనికులకు, కుటుంబ సభ్యులకు అతి పెద్ద పండుగ మహానాడని, కడప గడ్డపై పెట్టి చరిత్రను సృష్టించిందని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం కడపలో రెండవ రోజు మహానాడు సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి యోగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని తెలుగు ప్రజలందరూ ఉత్సవంగా మహానాడును జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. తెలుగుజాతి మొత్తం ఆరాధించే వ్యక్తి ఎన్టీఆర్‌అని కొనియాడారు. ఎన్టీఆర్ ప్రేరణతో చంద్రబాబు మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్ ఆశాకిరణం యువ నాయకుడు మంత్రి లోకేష్ అని పేర్కొన్నారు. రాజకీయ సభలో యోగా తీర్మానం చేసి ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో అరుదైన సంఘటన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అపారమైన నమ్మకంతో యోగా డేని విశాఖపట్టణంలో నిర్వహించటానికి నిర్ణయం తీసుకున్నారని ఈసందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్ కోరారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన గ్రామసభలో పారిశుధ్యం ప్రాధాన్యత, సూర్య ఘర్ ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్, స్థానిక టీడీపీ నేతలు మాగులూరి రమేష్‌బాబు, వీరాంజనేయులు, రాజేంద్రప్రసాద్, దయాసాగర్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి):అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, స్వామి సత్య సైన్య సేవాసమితి, జననీ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వాసు , తిరుపతిరెడ్డి , పెద్దన్న ,బుల్లయ్య , చంద్రబాబు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

బల్లికురవ, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ పంచాయతీ శివార కోటవారిపాలెం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ గుండెపోటుతో కూలీ అనుకు శ్రీనివాసరావు(48) మృతి చెందాడు. కోటవారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ శ్రీనివాసరావు రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా గుండె నొప్పితో కుప్పకూలి పడి పోయాడు. వెంటనే గమనించిన తోటి కూలీలు శ్రీనివాసరావును వైద్యశాలకు తరలించాలని ప్రయత్నించిన లోపే మృతి చెందాడు. కూలీ మృతిపై ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం తెలియజేశామని సిబ్బంది తెలిపారు.



మృతిచెందిన శ్రీనివాసరావు

పేద మహిళలకు కుట్టు మిషన్‌ల అందజేత

అద్దంకిటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): దాతలు అందించిన కుట్టు మిషన్‌లను జీవనోపాధిగా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. బుధవారం శ్రీ వాసవి ధన్వంతరీ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఎన్టీఆర్ 102 జయంతి సందర్భంగా స్థానిక గీతా మందిర్‌లో మున్సిపల్ కమిషనర్ పేద మహిళలు అనిత, శివ సుధారాణిలకు కుట్టు మిషన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరి ఉమ అన్నపూర్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి తిరునాళ్ల ఆదాయం రూ.6.64 లక్షలు

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల సందర్భంగా భక్తులు వివిధ రూపాలో సమర్పించుకున్న కానుకల ఆదాయం రూ.6,64,837 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆలయంలో ఒంగోలు దేవదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ వంశ పారంపర్య అర్చకులు తులసి , పెద్దకాపు ఆధ్వర్యంలో ఈవో పర్యవేక్షణలో కానుకల లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది కన్నా ఈఏడాది అమ్మవారి తిరునాళ్లకు రూ.75వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

గుండెపోటుతో పున్నయ్య మాస్టర్ మృతి

ఇంకొల్లు,మే 28,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చందలూరి చెంచుపున్నయ్య(65) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు పున్నయ్య మాస్టర్ మృతి పట్ల ఉపాధ్యాసంఘాలు,ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పేదలకు సాయం అందించాలి

మేదరమెట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం శ్రేణులు పేదలకు సాయం అందించాలని తెలుగుదేశం నాయకులు కారుసాల నాగేశ్వరరావు(బాబు) అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పేద విద్యార్థిని కర్ణ తేజాకు గ్రామ తెలుగుదేశం నాయకులు మోపర్తి లక్ష్మీనారాయణ తన తల్లి మోపర్తి హైమావతి జ్ఞాపకార్థం 5 వేల రూపాయలను అందజేశారు.

మహానాడుకు తరలిన టీడీపీ నేతలు

బల్లికురవ. మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పండుగ అయిన మహానాడుకు బల్లికురవ మండలం నుంచి టీడీపీ నేతలు, యువత పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బుధవారం ఉప్పుమాగులూరు గ్రామ తెలుగు యువత వాహనాలను ఏర్పాటు చేసుకొని తరలి వెళ్లారు. అలానే కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, బల్లికురవ, అంబడిపూడి గ్రామాల నుంచీ వెళ్లి మహానాడులో పాల్గొన్నారు.

మార్టూరులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

మార్టూరు,మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు కామేపల్లి హరిబాబు, శివరాత్రి శ్రీను తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇసుకదర్శి గ్రామంలో నాయకులు కేక్ కట్ చేశారు. మార్టూరులో బొడ్డురాయిసెంటరు వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి కమ్మ శివనాగేశ్వరరావు,చల్లగుండ్ల సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే వలపర్ల , మార్టూరు ఎంపీడీవో కార్యాలయంలో, యద్దనపూడి మండలంలో యద్దనపూడి, గన్నవరం,అనంతవరం,పూనూరు,యనమదల తదితర గ్రామాలలోజయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు.

పర్చూరులో

పర్చూరు : ఎన్టీఆర్ జయంతి వేడుకలు పర్చూరు మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. పర్చూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అదేవిధంగా మండలంలోని చిన్ననందిపాడులో సర్పంచ్ ముప్పా వెంకటశివ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చినగంజాంలో

చినగంజాం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన చినగంజాంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతిని విస్మరించడం విశేషం.